# పుష్పాంజలి

- శ్యామల దేవి దశిక, New Brunswick, NJ

ఎప్పుడు కనిపించినా నవ్వుతూ పలకరించి, ఉత్సాహంగా మాట్లాడే కిడాంబి రఘునాథ్ గారు ఇక లేరంటె నమ్మశక్యం కావడం లేదు. జ్యోతి పత్రిక రాగానే మొట్టమొదటిగా చేసే పని రఘునాథ్ గారి ఎడిటోరియల్ చదవడం. గత పాతికేళ్ళుగా మన కమ్యూనిటీలో ఎలాంటి మార్పులు వచ్చాయి, వస్తున్నాయి అనేది - ఆయన ఎడిటోరియల్ ద్వారా చెప్పవచ్చు. తరుచు ఇండియా ప్రయాణం చేసే ఆయన ఇక్కడే కాకుండా మన దేశంలో, ముఖ్యంగా, మన రాష్ట్రంలో వస్తున్న మార్పుల గురించి కూడా మనకు జ్యోతి ద్వారా అందచేసేవారు.

మన భాషా, సంస్కృతి, సాంప్రదాయము మనం ఎక్కడ వున్నా మరిచిపోకూడదు అన్నదే ఆయన సిద్దాంతం. వీటన్నిటినీ మనం (పెద్దవాళ్ళమే) మాత్రమే ఆచరించినంతమాత్రాన సరిపోదని, వీటిని జాగ్రత్తగా మన ముందు తరాలవారికి అందించవలసిన భాద్యత కూడా మనమీద వున్నదని, ఆయన ఎడిటర్‌గ మనకు తరచు గుర్తు చేస్తుండేవారు. ఈ భాద్యతని మనం సక్రమంగా నిర్వర్తించాలంటే, దానికి కృషి, పట్టుదలతోపాటు ఓర్పు కూడా ఎంతో అవసరమని చెప్తుండేవారు.

"ఇంటగెలచి రచ్చగెలవమన్నారు" మన పెద్దలు. సంస్కృతి, సాంప్రదాయం, భాషా, నడవడిక మన సమాజానికి ఎంతో ముఖ్యమని నొక్కి వక్కాణించే రఘునాథ్ గారు వట్టి మాటలమూట కాదు, చేతల మనిషి అనటానికి సాహిత్య, సంగీత, నాట్యాలకు ప్రతిబింబమైన వారి కుటుంబమే తార్కాణం. ముఖ్యంగా వారి అమ్మాయి ఉష మన యువతరానికి చక్కటి ఉదాహరణ. సంఘంలోని మంచిచెడులను, మార్పులను, తేడాలను ఎటువంటి సంకోచము లేకుండా నిర్భయంగా, నిబ్బరంగా చెప్పగలవారు రఘునాథ్ గారు. అంతేకాదు ఆయన ఆశావాది కూడా. అందుకే కాలంలో వస్తున్న మార్పుల ప్రవాహానికి తట్టుకోలేక తలవంచుచున్న తెలుగు సమాజాన్ని తమ ఎడిటోరియల్ ద్వారా ఉత్సాహపరుస్తూ, ఓదారుస్తూ, సమస్యలకు పరిష్కారం సూచిస్తూ ముందుకు నడిపించేవారు.

జూలై 13న బ్రిడ్జివాటర్ ఆలయప్రాంగణంలో చివరిసారిగా (అప్పుడు తెలియలేదు) కలిసినప్పుడు, "మనం ఈ భూమి మీద ఎన్ని రోజులు వుంటామో చెప్పలేము. వున్నన్ని రోజులు మంచిపనులు చేయడానికి ప్రయత్నించడమే మన పని. ఎందుకంటే మనం వెళ్ళిపోయినతరువాత మిగిలేవి అవే" అంటూ ఆయన చెప్పిన మాటలు నేను ఎప్పుడూ మరిచిపోను. వ్యక్తిగా, స్నేహితుడిగా, తెలుగు భాషా, కళల అభిమానిగా తెలుగు సమాజానికి, సంఘానికి రఘునాథ్ గారు చేసిన సేవ, అందించిన సంపద అమూల్యమైనది.

కిడాంబి రఘునాథ్ గారు లేని లోటు ఒక్క వారి కుటుంబానికే కాదు, మన కమ్యూనిటీకి కూడా తీరని లోటు అన్న మావారు రామకృష్ణ మాటలు అక్షరాలా నిజం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సమర్పిస్తున్న చిన్న పుష్పాంజలి.